క్లుప్తంగా

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



బాండ్ అందజేస్తున్న ఏఈవో నరసింగరావు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి శుక్రవారం హైదరాబాద్‌కు చెందిన దుప్పలపాటి శ్రీనివాస రావు, సౌమ్య దంపతులు లక్ష రూపాయల విరాళం ఇచ్చారు. సింహగిరిపై ఉన్న మే ఐ హెల్ప్ యూ కేంద్రంలో దేవస్థానం తరపున అన్నప్రసాద విభాగం ఏఈవో పాలూరి నరసింగరావు దాతలకు బాండ్ అందజేశారు. కార్యక్రమంలో పీఆర్వో నాయుడు పాల్గొన్నారు.

నేడు ట్యాబ్‌ల పంపిణీ

పరవాడ: స్థానిక జెడ్పీ బాలుర పాఠశాలలో శనివారం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం మంజూరు చేసిన ట్యాబులను ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అందజేస్తారని మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం ప్రభుత్వం నూతనంగా ముద్రించిన ఆరోగ్య శ్రీ కార్డులు కూడా పంపిణీ చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మిశ్రీనివాసరావు, జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు పాల్గొంటారన్నారు. పార్టీ శ్రేణులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల పార్టీ అధ్యక్షుడు కోన కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సింహాచలం: సాధారణ నిర్వహణ పనుల్లో భాగంగా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈపీడీసీఎల్ జోన్-3 ఈఈ పి.శ్రీనివాసరావు తెలిపారు. శ్రీనివాసనగర్, ప్రహ్లాదపురం, పాత గోశాల, సింహాచలం ఆర్టీసీ కాంప్లెక్స్ తదితర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, తిరిగి మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలో వర్క్‌షాప్ ప్రారంభం



వర్క్‌షాప్‌లో పాల్గొన్న విద్యార్థులు

పెందుర్తి: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈసీఈ ఆఖరి సంవత్సర విద్యార్థుల కోసం ఐవోటీ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై శుక్రవారం వర్క్‌షాప్‌లు ప్రారంభమయ్యాయి. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పలు అంశాలపై తర్ఫీదునిచ్చారు. ఇంట్రడక్షన్ ఆఫ్ ఐవోటీ, ఆర్కిటెక్చర్ ఆఫ్ ఐవోటీ, యాప్ డెవలప్‌మెంట్, ఎంఐటీ యాప్ ఇన్‌వెంటర్, టెక్ టూ స్పీచ్ కన్వెంటర్ అంశాలను తొలిరోజు పూర్తి చేశారు. వర్క్‌షాప్‌లో చీఫ్ టెక్నాలజీ అధికారి జామి మణితేజ తదితరులు పాల్గొన్నారు.

రెండు ద్విచక్రవాహనాల ఢీ

సబ్బవరం: మండలంలోని ఆనందపురం-అనకాపల్లి జాతీయ రహదారిపై బాటజంగాలపాలెం టోల్‌గేట్ వద్ద ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలు కాగా మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. సీఐ రంగనాథం శుక్రవారం తెలిపిన వివరాలు..అనకాపల్లి మండలంలోని కోడూరుకు చెందిన చిట్టి ప్రసాద్ తన సోదరుడుతో కలిసి ద్విచక్రవాహనంపై సబ్బవరం మండలంలోని బాటజంగాలపాలెం వస్తున్నారు. బాటజంగాలపాలెం టోల్‌గేట్ వద్దకు వచ్చే సరికి ఎదురుగా వేగంగా వస్తున్న మరో ద్విచక్రవాహనం బలంగా ఢీ కొట్టింది.దీంతో చిట్టి ప్రసాద్‌కు తీవ్ర గాయాలు కాగా అతని సోదరునికి స్వల్పగాయాలయ్యాయి.

● ఉత్సాహంగా 'ఆడుదాం ఆంధ్రా'



యువతలోని క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న క్రీడా పోటీలు నాలుగో రోజు శుక్రవారం నియోజకవర్గంలో ఉత్సాహభరితంగా సాగాయి. పెందుర్తి మండలం వాలిమెరక జుత్తాడ, పినగాడిలోని విస్తం ఇంజినీరింగ్ కళాశాలలో మైదానాల్లో క్రీడాకారులు వాలీబాల్, కబడ్డీ క్రీడా పోటీల్లో హోరాహోరీగా తలపడ్డారు. ప్రభుత్వ పాఠశాలల పీఈటీలు, సచివాలయాల కార్యదర్శులు పర్యవేక్షించారు. - పెందుర్తి

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

ఎన్టీపీసీ హెడ్ సంజయ్‌కుమార్ సిన్హా



సంస్థ హెడ్ సిన్హాను సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు

పరవాడ: గ్రామీణ ప్రాంతాల్లో ఎన్టీపీసీ సీఎస్సార్ ద్వారా మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని సింహాద్రి ఎన్టీపీసీ ప్రాజెక్టు హెడ్ సంజయ్ కుమార్ సిన్హా అన్నారు. దీపాంజలినగర్‌లో శుక్రవారం సీఎస్సార్ వాటాదారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు హెడ్ సిన్హా మాట్లాడుతూ అభివృద్ధి కార్యక్రమాల విషయంలో ప్రజా ప్రతినిధులు తమతో సహకరించాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో మరిన్ని సీఎస్సార్ కార్యక్రమాలు చేపట్టడానికి సంస్థ కృషి చేస్తుందన్నారు. సీఎస్సార్ ఆధారిత నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల్లో యువతను సమీకరించడానికి ప్రజా ప్రతినిధులు కృషి చేయాలన్నారు. 2023-24లో సీఎస్సార్ కార్యక్రమాల పురోగతిని వివరించారు. పరిసర గ్రామాల్లో మౌలిక సదుపాయాలు, ఆరోగ్యం, విద్య, నీరు, నైపుణ్యాభివృద్ధి సౌకర్యాలకు గణనీయంగా దోహదపడిందని పలువురు ప్రజా ప్రతినిధులు సంస్థ కార్యక్రమాలను ప్రశంసించారు. నిర్వాసిత గ్రామాల అభివృద్ధికి మరిన్ని నిధులు కేటాయించాలని ప్రజా ప్రతినిధులు కోరారు. అనకాపల్లి జిల్లాలో పరవాడ మండలాన్ని అభివృద్ధి చెందిన మండలాల్లో ఒకటిగా మార్చడంలో సింహాద్రి ఎన్టీపీసీ కీలక పాత్ర పోషిస్తోందని సంస్థ ప్రాజెక్టు హెడ్ సిన్హా అన్నారు. కార్యక్రమంలో వాడచీపురుపల్లి, నాయుడుపాలెం, రావాడ, ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం, వెన్నెలపాలెం, కలపాక, పరవాడ గ్రామాల ప్రజా ప్రతినిధులు, హెచ్‌ఆర్ హెడ్ బి.బి. పాత్ర పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం



మాంగల్యధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్య కల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను వేదికపై అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

రాజా అలంకరణలో దర్శనమిచ్చిన అప్పన్న



రాజా అలంకరణలో అప్పన్న



స్వామికి తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు, సిబ్బంది

సింహాచలం: సింహగిరిపై జరుగుతున్న రాపత్తు ఉత్సవాల్లో భాగంగా ఏడోరోజు శుక్రవారం శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి రాజా అలంకారంలో దర్శనమిచ్చారు. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని రాజుగా అలంకరించి శ్రీదేవి, భూదేవి సమేతంగా పల్లకీలో అధిష్టింపజేశారు. ఆళ్వారులను వేరొక పల్లకీలో వేంచేయజేసి సాయంత్రం సింహగిరి మాడ వీధుల్లో తిరువీధి నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు. పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

వ్యక్తి మృతిపై కేసు నమోదు



రెడ్డి సూర్యనారాయణ మృత దేహం

సబ్బవరం: మండలంలోని అనకాపల్లి-ఆనందపురం జాతీయ రహదారిపై బాటజంగాలపాలెం టోల్ గేట్ వద్ద ఆగి ఉన్న లారీలో క్లీనర్ వంట చేస్తూ గ్యాస్ స్టౌవ్‌పై పడి మృతి చెందాడు. స్థానిక సీఐ రంగనాథం శుక్రవారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరుకు చెందిన రెడ్డి సూర్యనారాయణ(38) అనే వ్యక్తి క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. బాటజంగాలపాలెం టోల్ గేట్ వద్ద ఆగి ఉన్న లారీ క్యాబిన్‌లో వంట చేస్తున్నాడు. సుగర్ వ్యాధి ఉండడంతో కళ్లు తిరిగి ప్రమాదవశాత్తు స్టౌవ్‌పై పడిపోయాడు. తీవ్రగాయాలు కావడంతో కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. దీనిపై కుమార్తె రెడ్డి స్వాతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పంచ గ్రామాల సమస్య పరిష్కరించాలని ధర్నా

సింహాచలం: పంచగ్రామాల భూసమస్యను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సమైక్య ప్రజా రైతు సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. ఆ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం సింహాచలంలో ధర్నా చేపట్టారు. ప్రధాన రహదారిపై కొద్దిసేపు బైఠాయించారు. కార్యక్రమంలో పాల్గొన్న 78వ వార్డు కార్పొరేటర్ గంగారావు మాట్లాడుతూ పంచ గ్రామాల భూసమస్య పరిష్కారంపై ప్రభుత్వం దృష్టిసారించాలన్నారు. సమైక్య ప్రజా రైతు సంక్షేమ సంఘం కార్యదర్శి టి.వి.కృష్ణంరాజు మాట్లాడుతూ పంచగ్రామాల భూసమస్యతో నివాసితులు, రైతులు, ఇళ్ల యజమానులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఏ ప్రభుత్వం వచ్చినా సమస్యను పరిష్కరించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎలాంటి షరతులు లేకుండా ఇళ్ల రిపేర్లు, నిర్మాణాలను అనుమతించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ శర్మ, సమైక్య ప్రజా రైతు సంక్షేమ సంఘం నాయకులు గోపాలకృష్ణ, ప్రతాప్, కోటేశ్వరరావు, రామభద్రరావు, నారాయణరావు పాల్గొన్నారు.

పన్నుల విభాగంలో ఇన్‌స్పెక్టర్ల పాత్ర కీలకం

విశాఖ సిటీ: కస్టమ్స్, జీఎస్టీలో ఇన్‌స్పెక్టర్ల పాత్ర కీలకమని కస్టమ్స్ అండ్ సెంట్రల్ ట్యాక్స్ చీఫ్ కమిషనర్ సంజయ్ పంత్ అన్నారు. శుక్రవారం అక్కయ్యపాలెంలోని నేషనల్ అకాడమీ ఆఫ్ కస్టమ్స్, ఇన్‌డైరెక్ట్ ట్యాక్సెస్ అండ్ నార్కోటిక్స్(ఎన్ఏసీఐఎన్) కార్యాలయంలో జీఎస్టీ ఇన్‌స్పెక్టర్లు, కస్టమ్స్ ప్రివెంటివ్ ఆఫీసర్లు, ఎగ్జామినర్ల 14 వారాల శిక్షణ ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న చీఫ్ కమిషనర్ సంజయ్‌పంత్ మాట్లాడుతూ ఇన్‌స్పెక్టర్లు డిపార్ట్‌మెంట్‌లో ముందు వరుసలో ఉంటారని, పన్ను చెల్లింపుదార్లతో నిత్యం సంబంధం కలిగి ఉండేది వారేనని పేర్కొన్నారు. పన్ను ఎగవేత కేసులు పెట్టడం, వాటి విచారణలో వారి పాత్ర చాలా ఉంటుందని వెల్లడించారు. ఫ్రంట్ లైన్ సిబ్బంది ఒక్క కేసును గుర్తిస్తే ప్రభుత్వానికి రూ.వందల కోట్ల పన్ను వస్తుందన్నారు. జీఎస్టీ ఇంటెలిజెన్స్ ఏడీజీ ఎం.ఆర్.ఆర్.రెడ్డి మాట్లాడుతూ కేసులు గుర్తించడంలో అధికారులు తెలుసుకోవాల్సిన సరికొత్త టెక్నాలజీ టూల్స్, డేటా అనలిటిక్స్, ఇతర సాంకేతికతలను వివరించారు. నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ మాట్లాడుతూ నిజాయతీకి మించిన విలువ లేదని పేర్కొన్నారు. అనంతరం శిక్షణ నివేదిక అందజేసి పట్టభద్రులైన అధికారులకు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఎన్ఏసీఐఎన్ అదనపు డైరెక్టర్ ఈదర రవికిరణ్ శిక్షణ పూర్తి చేసుకున్న ట్రైనీలను అభినందించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు




మాట్లాడుతున్న అజయ్‌జైన్

దాబాగార్డెన్స్ : స్వచ్ఛంద సేవకులు వికసిత్ భారత్ సంకల్పయాత్రలో భాగస్వామ్యం కావాలని, ఇది అందరి సత్ సంకల్పమని ఆంధ్రప్రదేశ్ హౌసింగ్ డిపార్ట్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ అజయ్‌జైన్ తెలిపారు. జోన్-4 పరిధి 36వ వార్డు రెల్లివీధి, ఏవీఎన్ కాలేజీ వద్ద శుక్రవారం భారత్ సంకల్ప్ యాత్రలో స్థానిక ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సెక్రటరీ మాట్లాడుతూ 2047 నాటికి భారతదేశం అభివృద్ధి చెందిన దేశాల సరసన చేరడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం వివిధ పథకాలు రూపొందించి అమలు చేస్తుందని తెలిపారు. ప్రధాని నరేంద్రమోదీ మంచి ఆలోచనతో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు, ఆర్థిక ప్రయోజనాలు అందేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడమే లక్ష్యంగా వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాల గురించి వివరించాలన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ అదనపు కమిషనర్ ఎస్ఎస్ వర్మ, జోనల్ కమిషనర్ శివప్రసాద్, ఏపీడీ పుణ్యవతి, మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసులు త్వరగా పరిష్కరించాలి

విజిలెన్స్-మానిటరింగ్ కమిటీ సమావేశంలో కలెక్టర్ మల్లికార్జున సూచన



మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున. చిత్రంలో డీసీపీ క్రైం వెంకటరత్నం తదితరులు

మహారాణిపేట : ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ పెండింగ్ కేసులకు వీలైనంత త్వరగా పరిష్కారం చూపాలని వివిధ విభాగాల అధికారులకు కలెక్టర్ డాక్టర్ ఎ. మల్లికార్జున సూచించారు. ఎస్సీ, ఎస్టీ యాక్ట్ జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా పలు అంశాలపై కలెక్టర్ స్పందించారు. క్లిష్టమైన కేసుల పరిష్కారంలో ప్రత్యేక చొరవ చూపాలని, వివరాల సేకరణలో జాప్యం లేకుండా బాధ్యతగా వ్యవహరించాలన్నారు. సుదీర్ఘంగా పెండింగ్‌లో ఉన్న కేసులపై మరింత శ్రద్ధ వహించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. గత సమావేశంలో చర్చకు వచ్చిన అంశాలపై ఇప్పటి వరకు తీసుకున్న చర్యల గురించి ఆరా తీశారు. సివిల్ రైట్స్‌పై సామాన్యులకు అవగాహన కల్పించాలని పోలీసు అధికారులకు సూచించారు. స్టే కేసులపై ప్రత్యేక చొరవ చూపి హైకోర్టు పీపీతో సంప్రదించాలని స్థానిక పీపీకి చెప్పారు. స్పందన ద్వారా వచ్చే కేసులు, దిశ ద్వారా నమోదయ్యే కేసులకు తక్షణ పరిష్కారం చూపాలన్నారు. బాధితులకు ప్రభుత్వం నుంచి వచ్చే రిలీఫ్, రిహేబిలిటేషన్ ఆర్థిక సాయం అందించాలని సంబంధిత అధికారులు తెలిపారు. సమావేశంలో సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు రామారావు, ఆర్డీవోలు హుస్సేన్ సాహెబ్, భాస్కర రెడ్డి, డీసీపీ క్రైం వెంకటరత్నం, పలువురు ఏసీపీలు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న నిరసన

పరవాడ: అక్రమంగా చెరువుల్లోకి వ్యర్థ రసాయనాలు విడిచిపెట్టి మత్స్య సంపద మృతికి కారణమైన ఫార్మా యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం డిమాండ్ చేశారు. పరవాడ పెద్ద చెరువులో ఫార్మా వ్యర్థ రసాయనాల కారణంగా చనిపోయిన మత్స్య సంపదకు నష్టపరిహారం చెల్లించాలని రైతులు 19 రోజులుగా చేస్తున్న నిరసన కార్యక్రమానికి ఆయన శుక్రవారం మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ ఫార్మా పరిశ్రమల యాజమాన్యాలు విడిచిపెడుతున్న వ్యర్థ రసాయనాల కారణంగా చేపలు, పశువులకు హాని కలుగుతుందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి గనిశెట్టి సత్యనారాయణ, పైల అప్పారావు, శ్రీను, నాయుడు పాల్గొన్నారు.

ధర్మారాయుడుపేట విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న సర్పంచ్ ఎం.ఎస్.నాయుడు తదితరులు

పరవాడ: కడపలో ఈ నెల 28, 29వ తేదీల్లో జరిగిన రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్‌లో మండలంలోని ధర్మారాయుడుపేట జెడ్పీ పాఠశాలకు చెందిన పి.సాయి బాలాజీ, ఆర్.భానుతేజ రూపొందించిన స్మార్ట్ హౌస్ ప్రాజెక్టు రాష్ట్ర స్థాయిలో తృతీయ స్థానం సాధించి రీజినల్ సైన్స్ ఫెయిర్‌కు ఎంపికైంది. వీరికి గైడ్ గా ఉపాధ్యాయుడు కె.ఆదినాయుడు వ్యవహరించారు. రీజినల్ సైన్స్ ఫెయిర్‌కు ఎంపికైన విద్యార్థులను శుక్రవారం సర్పంచ్ ఎం.ఎస్.నాయుడు, వైస్ ఎంపీపీ బంధం నాగేశ్వరరావు, పాఠశాల హెచ్‌ఎం వి.సన్యాసి అభినందించారు.

వ్యవసాయ కనెక్షన్లకు నాణ్యమైన విద్యుత్ సరఫరా

ఎంపీపీ బోకం సూర్యకుమారి



మాట్లాడుతున్న ఎంపీపీ బోకం సూర్యకుమారి

సబ్బవరం: వ్యవసాయ విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలని ఎంపీపీ బోకం సూర్యకుమారి అన్నారు. స్థానిక సబ్ స్టేషన్ ఆవరణలో విద్యుత్తు వినియోగదారుల సలహా సంఘం సమావేశం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ మాట్లాడుతూ రైతులకు 9 గంటల పాటు నాణ్యమైన విద్యుత్తు అందించాలని, అదే విధంగా విద్యుత్ కనెక్షన్‌కు దరఖాస్తు చేసుకున్న రైతులకు సకాలంలో కనెక్షన్ మంజూరు చేయాలని సూచించారు. పొలాల్లో వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ లైన్లను సరి చేయాలని, దెబ్బతిన్న విద్యుత్తు స్తంభాలను మార్చడంతో పాటు లో వోల్టేజీ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ కోరారు. ఏఈ అశోక్ మాట్లాడుతూ దరఖాస్తు చేసుకున్న వారం రోజుల్లో రైతులకు విద్యుత్ కనెక్షన్ మంజూరు చేస్తున్నామని తెలిపారు. ప్రజల నుంచి వస్తున్న గ్రీవెన్స్ వెంటనే పరిష్కరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఈపీడీసీఎల్ ఏఈ వీరేంద్ర, నాయకులు బోకం రామునాయుడు, సలహా కమిటీ సభ్యులు కోట్ని అమ్మతల్లి నాయుడు, వెన్నల శ్రీరాములనాయుడు, కోరుబిల్లి నూకరాజు, బోను గంగునాయుడు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ధనుర్మాసోత్సవాలు



వెంకన్నకు అభిషేకం చేస్తున్న అర్చకులు, పూజలందుకున్న గోదాదేవి

పెందుర్తి: స్థానిక వెంకటాద్రిపై ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం 13వ పాశురం విన్నపం జరిగింది. ముందుగా స్వామివారికి విశేష అభిషేకాలు,గోదాదేవి అమ్మవారికి మంగళస్నానం చేయించారు. అలంకరణ చేసి ప్రత్యేక పూజలు చేశారు. భారీ ఎత్తున తరలివచ్చిన భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

ప్రకృతి వ్యవసాయంతో లాభాలు



వెన్నలపాలెంలో మోడల్ క్షేత్రాన్ని పరిశీలిస్తున్న మహిళలు

పరవాడ: మండలంలోని వెన్నలపాలెం గ్రామంలో సాగు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని గ్రామ సమైక్య సంఘ ప్రతినిధులు శుక్రవారం పరిశీలించారు. గ్రామ సమైక్య సంఘాల ఆధ్వర్యంలో 20 సెంట్ల స్థలంలో ప్రకృతి వ్యవసాయంలో కూరగాయలు, ఇతర పంటల సాగు చేయడం ద్వారా నెలకు రూ.10 వేల ఆదాయం సమకూర్చుకోవడానికి వీలవుతుందని మండల సమైక్య అధ్యక్షురాలు చుక్క సత్యవతి సూచించారు. ప్రకృతి వ్యవసాయంపై సంఘ సభ్యులు అవగాహన పెంపొందించుకోవాలన్న ఉద్దేశంతో క్షేత్ర స్థాయి పరిశీలన చేసినట్టు చెప్పారు. ఈ విధానంలో సాగు లాభదాయకంగా ఉంటుందన్నారు. ఏటీఎం మోడల్ క్షేత్ర పరిశీలనలో మహిళ సమైక్య ట్రెజరర్ పరవాడ మాధవీ ప్రసన్న, డివిజినల్ ఇన్‌చార్జి ఎం.వెంకటలక్ష్మి, మోడల్ మేకర్ డి.మహాలక్ష్మి, పి.సంతోష్, బలరామ, రామలక్ష్మి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మేలుకొలుపు



నాయుడుపాలెంలో భగవంతుడిని ఊరేగిస్తున్న భక్తులు

పరవాడ: ధనుర్మాసంలో భాగంగా గ్రామాల్లో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. దేవాలయాల కేంద్రంగా సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మేలుకొలుపు కార్యక్రమాన్ని గ్రామ గ్రామాన నిర్వహిస్తున్నారు. పరవాడ, నాయుడుపాలెం, వాడచీపురుపల్లి, బొద్దపువానిపాలెం గ్రామాల్లో శుక్రవారం భక్తులు మేలుకొలుపు కార్యక్రమం నిర్వహించారు. హరినామ కీర్తనలతో భగవంతుడిని ఊరేగించారు. ప్రతి ఒక్కరూ దేవాలయం, సమాజం, దేశంపై భక్తి భావాన్ని పెంపొందించుకోవాలన్నారు. అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను మండలంలోని ధార్మిక జట్లకు అందించారు. దేవాలయ కేంద్రంగా ప్రతీ రోజూ శ్రీరామ జయ రామ మహామంత్రాన్ని 108 పర్యాయాలు జపించాలని సూచించారు. జనవరి 1 నుంచి వారం రోజుల పాటు రామయ్య అక్షింతలు, రామయ్య చిత్ర పటంతో ఇంటింటికీ వెళ్లి అయోధ్యకు రావాలని ఆహ్వానించనున్నట్టు చెప్పారు. మేలుకొలుపు కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మాతృమూర్తులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు పక్కాగా అమలయ్యేలా..

ప్రత్యేక అధికారుల నియామకం

సాక్షి, విశాఖపట్నం : ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు చేరేందుకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి కలెక్టర్ డాక్టర్ మల్లికార్జునను ఆదేశించారు. నవరత్నాల సంక్షేమ ఫలాలు అందరికీ అందేందుకు మండలాల వారీగా పర్యవేక్షణ అవసరమని సూచించారు. ఈ నేపథ్యంలో జిల్లాలో అమలవుతున్న సంక్షేమ పథకాల పర్యవేక్షణకు 11 మండలాలకు ప్రత్యేకాధికారులను నియమిస్తూ కలెక్టర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. మండలాల పరిధిలో ఉన్న సచివాలయాల పరిధిలో క్షేత్రస్థాయి పర్యటనలు చేయడంతో పాటు అవగాహన సదస్సులు నిర్వహించాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. రెండో దశ జగనన్న ఆరోగ్య సురక్ష, వైఎస్సార్ పింఛను కానుక, చేయూత, ఆసరా తదితర కార్యక్రమాల నిర్వహణ, అమలుపై సచివాలయ సిబ్బందితో స్థానికంగా సమావేశాలు నిర్వహించాలని, ప్రభుత్వ విధానాలు తెలపాలని సూచించారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

ప్రత్యేకాధికారులు వీరే...

మండలం	ప్రత్యేకాధికారి	హోదా
పద్మనాభం	జి. సూర్యప్రకాశరావు	జిల్లా పౌర సరఫరాల అధికారి
భీమునిపట్నం	ఎస్. భాస్కరరెడ్డి	ఆర్డీవో, భీమిలి
ఆనందపురం	టి. సీతారామ్మూర్తి	స్పెషల్ డిప్యూటీ కలెక్టర్
విశాఖపట్నం రూరల్	జీవీఎస్ఎస్ రామమోహన్‌రావు	స్పెషల్ డిప్యూటీ కలెక్టర్
సీతమ్మధార	చక్రవర్తి	డీపీవో, జీవీఎంసీ
మహారాణిపేట	చంద్రిక	డీపీవో, జీవీఎంసీ
గోపాలపట్నం	పి. శేషశైలజ	స్పెషల్ డిప్యూటీ కలెక్టర్
ములగాడ	టి. ప్రవీణ	జిల్లా కో-ఆపరేటివ్ అధికారి
గాజువాక	డి. లక్ష్మారెడ్డి	ఎస్టేట్ అధికారి, వీఎంఆర్డీఏ
పెదగంట్యాడ	డాక్టర్ వి.సన్యాసిరావు	అదనపు కమిషనర్, జీవీఎంసీ
పెందుర్తి	డి. హుస్సేన్ సాహెబ్	ఆర్డీవో విశాఖపట్నం